క్లుప్తంగా

మల్యాల టూ బ్రహ్మంగారి మఠం

- కాలినడకన బయలుదేరిన మాలధారులు



మాలధారులకు అరటి పండ్లు పంపిణీ చేస్తున్న ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్

నందికొట్కూరు: మండల పరిధిలోని మల్యాల గ్రామం నుంచి జగద్గురువు మద్విరాట్ పోతులూరు వీర బ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబ ల ఆలయానికి బ్రహ్మయ్య దీక్ష మాలధారులు సోమవారం బయల్దేరారు. కాలినడకన వెళ్తున్న మాలధారులకు రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ షుకూర్ అరటిపండ్లు పంపిణీ చేశారు.

29న వాలీబాల్ పోటీలు

కొత్తపల్లి: ఈనెల 29న మండలంలోని దుద్యాల గ్రామంలో నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు పి.సురేష్, ఎస్.ప్రతాప్ సోమవారం కోరారు. మే 2న సీఎస్ఐ చర్చీ వార్షికోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న జట్లు ఈనెల 27లోపు 7799169757, 9640991667 నంబర్లను సంప్రదించి ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

మిడుతూరు: మండల పరిధిలోని జలకనూరు మద్దిగుండం చెరువులో ఉపాధి కూలీలు చేపట్టిన పూడికతీత పనులను సోమవారం నంద్యాల క్లస్టర్ ఏపీడీ బాలాజీనాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ పని ప్రదేశానికి ఉదయం త్వరగా చేరుకుని నిబంధనల ప్రకారం పనులు చేసి త్వరగా ఇళ్లకు చేరుకోవాలన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున మజ్జిగ, నిమ్మరసం తదితర ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ జయంతి ఉన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోండి

ఆత్మకూరు: భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్ రెడ్డి రైతులకు సూచించారు. పట్టణ శివారులో సోమవారం భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ఫలితాలను బట్టి మందులు, ఎరువులు వేసుకుంటే పొలం సారవంతమై పంటల్లో అధిక దిగుబడులు వచ్చే వీలుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ షేక్ బైరాపరం మహబూబ్‌బాషా, కౌలు రైతు సంఘం పట్టణ అధ్యక్షుడు అస్రఫ్‌అలీ పాల్గొన్నారు.

మొక్కజొన్న బస్తాలు చోరీ

జూపాడుబంగ్లా: మొక్కజొన్న బస్తాలను సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధిత రైతు తెలిపిన వివరాలు.. మండలంలోని తంగడంచ గ్రామానికి చెందిన రైతు బోయ మద్దిలేటి తనపొలంలో పండిన మొక్కజొన్నలను గ్రామశివారులోని చింతచెట్ల కింద రెండు రోజుల క్రితం అరబోసుకున్నాడు. వ్యాపారి కొనుగోలు కోసం రావాల్సి ఉండటంతో కాటా వేసి 25 బస్తాలకు నింపి విక్రయించేందుకు సిద్ధంగా ఉంచి ఆది వారం రాత్రినిద్రకు ఉపక్రమించాడు. ఉదయం లేచి చూసేసరికి 2 బస్తాలు తప్ప మిగతా 23 బస్తాలు కనిపించకపోవడంతో లబోదిబోమన్నాడు.

నిర్లక్ష్యం నిండుగా... నీళ్ల ట్యాంక్ ఖాళీగా!

- 30 ఏళ్లుగా నిరుపయోగం
- శిథిలావస్థకు చేరుకోవడంతో భయం గుప్పిట్లో ప్రజలు
- పట్టించుకోని అధికారులు

పాములపాడు: ప్రజలకు దాహార్తి తీర్చడానికి నిర్మించిన నీటి ట్యాంకు అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారింది. 30ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు ఏ రూపంలో ముంపు ముంచుకొస్తుందోనని ప్రజలు భయందోళనకు గురవుతున్నారు.

మండలంలోని రుద్రవరం గ్రామంలో దాదాపు 30 ఏళ్ల క్రితం 20 వేల లీటర్ల సామర్థ్యంతో రూ.2లక్షలు వెచ్చించి ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు నిర్మాణం చేపట్టారు. ఇప్పటి వరకు కేవలం ఒక్కసారి మాత్రమే ట్యాంకుకు నీటిని ఎక్కించి గ్రామంలోకి సరఫరా చేశారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఆ నీరు కూడా కేవలం ఒక కాలనీలోని 3 కుళాయిలకు మాత్రమే సరాఫరా అయ్యింది. ఆ తర్వాత ట్యాంకుకు నీరు ఎక్కించడం నిలిపేశారు. అధికారులు ట్యాంకు నిర్మాణంలోనూ, పైపు లైన్ ఏర్పాటులోనూ నిర్లక్ష్యం వహించడం వల్లే ట్యాంకు నిరుపయోగంగా మారిందని తెలుస్తోంది. ఇష్టానుసారంగా పైపులైన్ చేపట్టడం, నాసిరకంగా నిర్మించడం వల్లే నీటి సరఫరా జరగడం లేదు. గ్రామంలో 532 కుటుంబాలు, 1,40 మంది జనాభా ఉందిస్తుతం గ్రామంలో 2 చొప్పున జీఎల్‌ఎస్‌ఆర్, సింటెక్స్ ట్యాంకు లున్నాయి. వీటి ద్వారానే ఆయా కాలనీల్లో ప్రజలు నీటిని వినియోగించుకుంటున్నారు. గ్రామంలో జనావాసాల మధ్య శిథిలావస్థలో ఉన్న ట్యాంకు పెచ్చులు ఊడిపడుతోందని, ప్రమాదం ఎప్పుడు ఏ రూపంలో వస్తుందోనని ప్రజలు భయాందోళకు గురవుతున్నారు. ప్రజా ధనం వృథాతో పాటు ప్రజలకు ప్రమాదకరంగా ఉన్న ట్యాంకుపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉండి, శిథిలావస్థకు చేరిన ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు

ట్యాంకు నుంచి నీరు సరఫరా చూడనేలేదు



ఇప్పటి వరకు గ్రామంలోని ట్యాంకు నుంచి నీటిని సరఫరా చేయడం చూడనేలేదు. నిరుపయోగంగా ఉండటంతో పాటు ప్రమాదకరంగా ఉంది. ఆలయం పక్కనే ట్యాంకు ఉండటం ప్రజలకు మరింత ప్రమాదకరంగా ఉంది. నిత్యం ప్రజల సంచారం ఉంటుంది. కొందరు ఇక్కడే సేదతీరుతూ ఉంటారు. ప్రమాదం జరగక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలి

– సురేష్, రుద్రవరం

ట్యాంకును కూల్చేయాలి



గ్రామానికి ఉపయోగపడని ట్యాంకు ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటే. పెచ్చులు ఊడి పడుతుంది. పిల్లలు ఆడుకుంటుంటారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు. ప్రమాదకరంగా, నిరుపయోగంగా ఉన్నటువంటి ఈ ట్యాంకును కూల్చి వేయడం మంచిది. ట్యాంకు కోసం ఖర్చు చేసిన డబ్బు వృథా అయ్యింది.

– వెంగన్న, రుద్రవరం

పరిశీలిస్తాం



ట్యాంకు నిరుపయోగంగా ఉన్న విషయం తెలియదు. గతంలో మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలుసు. ఏది ఏమైనా గ్రామానికి వెళ్లి ట్యాంకును పరిశీలిస్తాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– సుమిత్రమ్మ, ఎంపీడీఓ

రైతాంగ విప్లవ యోధుడు మండ్ల సుబ్బారెడ్డి

వెలుగోడు: రైతాంగ విప్లవ యోధుడు మండ్ల సుబ్బారెడ్డి అని సీపీఐ(ఎంఎల్) నాయకుడు రామ సుబ్బారెడ్డి కొనియాడారు. మండ్ల సుబ్బారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని మండ్ల సుబ్బారెడ్డి స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ వెలుగోడులో సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన సుబ్బారెడ్డి చిన్న వయసులో వ్యవసాయదారుడిగా ఉన్నప్పుడే రైతాంగ పోరాటం, జాతీయోద్యమంతో ప్రభావితమయ్యారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తెలుగు గంగ సిబ్బంది సురేష్, వీరభద్రుడు, మల్లేష్, యల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

నందికొట్కూరు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కౌన్సిలరు షేక్ నాయబ్, వైఎస్సార్‌సీపీ పట్టణ సీనియర్ నాయకులు ఉస్మాన్‌బేగ్ అన్నారు. సోమవారం 5, 7, 27వ వార్డుల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాలనపై ఆరా తీశారు. సీఎం ఫొటో ఉన్న స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు. కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవూఫ్, గృహ సారథులు, రథసారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు అబుబక్కర్, రమేష్, శ్రీను పాల్గొన్నారు.



తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

ప్రతి గడప ఆనందిస్తోంది

శ్రీశైలంప్రాజెక్ట్: రాష్ట్రంలో సంక్షేమ పథకాల వలన ప్రతి గడప ఆనందంగా ఉందని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం వెస్ట్రల్ కాలనీ, రిక్షా కాలనీ, ప్రభుత్వ ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో ఏమైనా సమస్యలున్నాయా.. అంటూ ప్రజలను ఆరా తీశారు. సంక్షేమ పథకాలు అందుతున్న ప్రతి కుటుంబం ఆనందంగా ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. తాగునీటి సమస్య ఉందని కొందరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ మోహన్‌కుమార్, మండల తహసీల్దార్ రాజేంద్రసింగ్, పంచాయితీ కార్యదర్శి బాలునాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పకీరయ్య, ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ సత్యనారాయణ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టి వెంకటరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి ఎమ్ ఎ రజాక్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి జింకా గుండయ్య యాదవ్, మండల నాయకులు భరత్‌రెడ్డి, ఆసాది ప్రవీణ్‌దివ్యతేజ, ఆటోమల్లి, కన్నయ్య, పాపారావు, గౌస్‌మొహిద్దీన్, ముస్తఫా, ప్రభావతి, పోలమ్మ, బాదరమ్మ పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి

మోటార్ల కొనుగోలుకు ఎమ్మెల్యే సొంత నిధులు

ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సోమవారం శ్రీశైలండ్యామ్ వద్ద పంపింగ్ సిస్టమ్‌ను పరిశీలించారు. అక్కడే ఇంజినీర్లతో సమావేశమై నీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. డ్యామ్‌వద్ద స్టాండ్ బైగా మరో 110 హెచ్‌పీ, వ్యూపాయింట్ వద్ద రెండు 150 హెచ్‌పీ మోటర్లతో పాటు స్టాటర్లు ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని ఇంజినీర్లు తెల్పి చెప్పారు. ఇందుకోసం సుమారు రూ.27 లక్షలు అవసరం అవుతుందని, ప్రభుత్వం నుంచి నిధులు లేవని ఇంజినీర్లు ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మూడు మోటార్లతో పాటు స్టాటర్ల కొనుగోలుకు అవసరమైన రూ.27 లక్షలను తాను స్వయంగా అందిస్తానని యుద్ధ ప్రాతిపదికన వాటిని తెప్పించి, బిగించి కాలనీ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే ఇంజినీర్లను కోరారు. విషయం తెలుసుకున్న ప్రజలు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని అభినందించారు. మంచినీటి కొరత తీర్చేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఇంజినీర్లు గంగాధర రెడ్డి, ప్రకాష్, చిట్టిబాబు ప్రైవేట్ కాంట్రాక్టర్ భాస్కర్‌రావు పాల్గొన్నారు.

నాగంపల్లి సింగిల్ విండో చైర్మన్‌గా గౌరు జనార్దన్‌రెడ్డి

కొత్తపల్లి: నాగంపల్లి సింగిల్ విండో చైర్మన్‌గా ఎర్రమఠం గ్రామానికి చెందిన గౌరు జనార్దన్‌రెడ్డి, డైరెక్టర్లుగా పెద్దగుమ్మడాపురం అచ్చిరెడ్డి, దుద్యాల చంద్రమోహన్‌లు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతనం చైర్మన్ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం సొసైటీ ద్వారా కృషి చేస్తామన్నారు. అనంతరం నూతన చైర్మన్, డైరెక్టర్లను ఎంపీపీ, జెడ్పీటీసీలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమలత, జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి, ఆత్మకూరు కేడీసీసీ బ్యాంకు మేనేజర్ రవికుమార్, సొసైటీ సీఈఓ కోటేశ్వరయ్య, ఎర్రమఠం సర్పంచు బాల ఎల్లయ్య, నందికుంట ఎంపీటీసీ సభ్యుడు బాలరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చైర్మన్ గౌరు జనార్దన్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

దేశాన్ని కాపాడుకుందాం

వెలుగోడు: కేంద్రంలో ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.రామదాస్ సూచించారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ప్రచార జాతా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి కరెంట్ ఆఫీసు, హైస్కూలు, ఆరుగులు, పెద్ద మార్కెట్, కొమ్మపాలెం, సీపీ నగర్, లక్ష్మీ నగర్, ద్వారక నగర్, పోస్టాఫీస్, పెట్రోల్ బంకు, గాంధీనగర్ మీదుగా సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు పాదయాత్రగా సాగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామదాసు మాట్లాడుతూ 2 లక్షల ఉద్యోగాలిస్తామని నమ్మబలికిన బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. పెట్రోలు, గ్యాస్, డీజిల్ తదితర నిత్యవసర వస్తువుల ధరలు పెంచి పేదల మీద భారం మోపిందన్నారు. ప్రభుత్వ పరిశ్రమలను ప్రైవేట్ పరం చేస్తూ కార్మికుల పొట్ట కొడుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగమోహన్, మహమ్మద్ రఫీ, వెంకటయ్య, ఎర్రబాషా, జి బాషా, రహమతుల్లా, నూరుల్లా, ఆంజనేయులు, భాస్కర్, పకీరయ్య, మొహమ్మద్, లింగన్న, మదార్ వలి, సుధాకర్, సుబ్బయ్య, పెద్దవలి, ఖాదర్ వలీ, మోదిన్, రామకష్ణ, నాగరాజు, కష్ణ పాల్గొన్నారు.

జగనన్నను మరో మారు ఆశీర్వదించండి

జూపాడుబంగ్లా: వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని జెడ్పీటీసీ సభ్యుడు పోచా జగదీశ్వరరెడ్డి కోరారు. సోమవారం మండలంలోని పారుమంచాల గ్రామంలో జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రంతో కూడిన స్టిక్కర్లను ఆయా ఇళ్ల గోడలపై అతికించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హేమశేఖర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, విజయ్‌కుమార్, అనిల్‌కుమార్, చల్లా రమేష్ రెడ్డి, అనకలి గోకారి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా మహానందీశ్వర దంపతుల పల్లకీ సేవ

మహానంది: కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లు సోమవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. గోమాతను అలంకరించి పల్లకీ ముందు ఉంచి ఆలయ ప్రాకారాల్లో ఉత్సవాన్ని వైభవంగా చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్ పాల్గొన్నారు.



మహానందిలో పల్లకీ సేవ దృశ్యం

వైఎస్సార్ స్మృతివనానికి రంజాన్ సందడి



వైఎస్సార్ స్మృతివనంలో జన కోలాహలం

ఆత్మకూరు రూరల్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అంటే ముస్లింలకు ప్రత్యేక అభిమానం. తమకు 4 శాతం రిజర్వేషన్ అమలు చేయడం వల్ల ఆయన వారికి అభిమాన పాత్రుడయ్యారు. ముస్లింలు పవిత్ర రంజాన్ మాసాన్ని భక్తి ప్రపత్తులతో జరుపుకుంటారు. మరుసటి రోజు దర్శనీయ ప్రదేశాలకు వెళ్లడం వారి సంప్రదాయం. అందులో భాగంగా ఆత్మకూరు మండలం నల్లకాల్వ గ్రామ శివారులో ఏర్పాటైన వైఎస్సార్ స్మృతివనానికి పెద్ద సంఖ్యలో ముస్లింలు తమ కుటుంబాలతో కలిసి వచ్చి సందడి చేశారు. రంజాన్ సందర్భంగా స్మృతి వనానికి రోజుకు రూ.1.30 లక్షల ఆదాయం సమకూరినట్లు అక్కడి సిబ్బంది తెలిపారు.

సాహితి సంకలన పురస్కారానికి నాగలక్ష్మి ఎంపిక

శ్రీశైలం ప్రాజెక్ట్: తెలుగు వెలుగు ఎస్‌వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30న హైదరాబాద్‌లోని పటాన్‌చెరువులో జరగబోయే సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవానికి తనకు ఆహ్వానం అందిందని సున్నిపెంటకు చెందిన సిరిపురపు నాగలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ తనకు పురస్కారంతో పాటు తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సను అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

నల్లమల ఘాట్‌లో చెట్లను ఢీకొన్న లారీ

మహానంది: నంద్యాల-గిద్దలూరు ఘాట్‌రోడ్డులో ఓ లారీ చెట్లను ఢీకొనడంతో డ్రైవర్ ప్రాణాలతో బయటపడగా క్లీనర్‌కు తీవ్ర గాయాలైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. బేతంచెర్ల నుంచి స్టోన్ క్రషర్ పౌడర్ లోడుతో విజయవాడకు వెళ్తున్న లారీ నల్లమల ఘాట్‌లోని పచ్చర్ల వద్ద అదుపుతప్పి చెట్లను ఢీకొంది. ఈ ఘటనలో యనకండ్ల గ్రామానికి చెందిన డ్రైవర్ నరసింహారెడ్డి అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డారు. క్లీనర్‌వైపు లారీ ముందు భాగం దెబ్బతినడంతో బనగానపల్లెకు చెందిన క్లీనర్ అల్లిబాషా లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు అతికష్టం మీద బయటికి తీశారు. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రోడ్‌సేఫ్టీ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.



నేడు వాహనాల వేలం

వెలుగోడు: వివిధ కేసుల్లో పట్టుబడిన 24 బైకులు, 2 కార్లను ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో మంగళవారం వేలం నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. వేలంలో పాల్గొని వాహనం దక్కించుకున్న వ్యక్తి వేలం డబ్బుతో పాటు జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9441292049 సంప్రదించాలని సూచించారు.

5 శాతం రాయితీకి ఆరు రోజులే గడువు

నందికొట్కూరు: మున్సిపల్ పరిధిలో నివాసం ఉంటున్న ప్రజల ఆస్తులకు పన్ను చెల్లింపులో 5 శాతం రాయితీ చెల్లించేందుకు ఆరు రోజులు గడువు ఉందని మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్నును ఒకేసారి నెలాఖరులోపు చెల్లిస్తే రాయితీ వర్తిస్తుందన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కౌంటరు వద్ద, వార్డు సచివాలయాల వద్ద పన్నులు చెల్లించవచ్చన్నారు. సెలవు రోజుల్లోనూ కౌంటర్లు తెరిచే ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొణిదెల విద్యార్థుల ప్రతిభ



వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

నందికొట్కూరు: వ్యాసరచన పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారని కొణిదేల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నారాయణరెడ్డి అన్నారు. సోమవారం విద్యార్థులను పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది డిసెంబరు 15న హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యూకేషనల్ ట్రస్ట్, రామచంద్ర మిషన్, యూనిక్ ఫర్ ఇండియా అండ్ భూటాన్ సంయుక్తంగా నిర్వహించిన గ్లోబల్ హార్ట్‌ఫుల్‌నెస్ వ్యాసరచన పోటీల్లో 14 నుంచి 18 ఏళ్ల కేటగిరీ-1 విభాగంలో 30 మంది విద్యార్థులు పాల్గొనగా తమపాఠశాల విద్యార్థులు 8 మంది ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రాలు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయులతో పాటు శాప్ కోఆర్డినేటర్ జిల్లా కన్వీనర్ శ్రీనాథ్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీగా బొల్లవరం

- సర్పంచ్‌కు అవార్డు అందించిన కలెక్టర్, జెడ్పీ చైర్మన్

మహానంది: మండల పరిధిలోని బొల్లవరం పంచాయతీకి జిల్లా స్థాయి ఉత్తమ ఆరోగ్యకరమైన గ్రామ పంచాయతీ అవార్డు లభించింది. నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీ పురస్కారం-2023 ఉత్సవాల్లో గ్రామ సర్పంచ్ షేక్ జమాల్ బీ, కార్యదర్శి సుమాంజలిలకు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తదితరులు సోమవారం ప్రశంసా పత్రాన్ని అందించారు.



బొల్లవరం సర్పంచ్ షేక్ జమాల్‌బీకి అవార్డు అందిస్తున్న కలెక్టర్, ప్రముఖులు

☛ తిమ్మాపురంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో పలు పంచాయతీలకు మండల స్థాయి అవార్డులను జెడ్పీటీసీ సభ్యుడు కేవీఆర్ మహేశ్వరరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి అందజేశారు.

☛ **వెలుగోడు:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి ఎంపీపీ లాలం రమేష్, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమా, ప్రజా ప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 9 అంశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామ పంచాయతీలకు మండల స్థాయి ఉత్తమ పంచాయతీ పురస్కారాలను ఎంపీడీఓ షేక్ అమానుల్లా అందజేశారు.

☛ **బండిఆత్మకూరు:** మండల పరిషత్ కార్యాయంలో ఎంపీడీవో వాసుదేవ గుప్తా ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్రటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎంపీడీఓ ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పరమటూరు సహకారం సంఘం చైర్మన్ బూరం శివలింగం, ఈఓఆర్డీ శ్రీనివాసులు, ఏపీఓ వసుధారెడ్డి, సర్పంచ్ సంధ్య, ఎంపీటీసీ పుల్లయ్య, కోఆప్షన్ సభ్యుడు జమాల్ పాల్గొన్నారు.

☛ **నందికొట్కూరు:** పంచాయతీలను సర్పంచులు అభివృద్ధిబాటలో నడిపిస్తున్నారని ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవంలో సర్పంచులను మండల అధికారులు, ప్రజాప్రతిధిలతో కలిసి ఎంపీపీ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కలిమున్నీసాబేగం, ఎంపీడీఓ శోభరాణి, ఎంఈఓ ఫైజున్నీసాబేగం పాల్గొన్నారు.

☛ **జూపాడుబంగ్లా:** పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా నిర్వహించారు. అనంతరం తొమ్మిది అంశాలల్లో ఉత్తమ పంచాయతీలు ఎంపికైన సర్పంచులను, పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ మంజులవాణి, ఈఓపీఆర్డీ మణి మంజరి సన్మానించి సర్టిఫికెట్లు అందజేశారు.

☛ **కొత్తపల్లి:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతో పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఎంపీడీఓ మేరి, ఈఓఆర్డీ శ్రీనివాసులు నాయుడు ఘనంగా నిర్వహించుకున్నారు. అనంతరం ఉత్తమ గ్రామపంచాయతీలు ఎంపికైన గ్రామాల సర్పంచులను, పంచాయతీ కార్యదర్శులను సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

☛ **మిడుతూరు:** ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డి, ఈఓఆర్డీ ఫకృద్దీన్ హాజరై ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన గ్రామాల సర్పంచులను, పంచాయతీ కార్యదర్శులను సన్మానించారు.

☛ **పాములపాడు:** పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. 9 కేటగిరీల్లో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులను ఎంపీడీఓ సుమిత్రమ్మ తదితరులు సన్మానించారు.

☛ **పగిద్యాల:** జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని సర్పంచులను సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పుల్యాల దివ్య, వైస్ ఎంపీపీ అరుణమ్మ, ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఈఓ సుభాన్, ఈఓపీఆర్డీ పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.